# మా ఊర్రోడ్డు

మా ఊర్రోడ్డు మణుసులో మెదిల్తే ఎండన బడొచ్చిన గొర్రెల కంట్లోపణ్ణె చెరువయి పోతింది నా తలకాయి. ఆ తలకాయి లోకి వద్దంటే గూడా ఆలోచన్లు గొర్రెల గుంపు మాదిర్తో ఒక్క మోపన దూర్తాయి. స్టాపింగులో టవును బస్సు నిలబడే కుందికి ఈ టవన్లల్లో మణుసులే గొర్రెలయి పోతా వుంటే యాణ్ణో పల్లె కొంపల్లో ఉండే చెరువు రేవుల్లో గొర్రెల్ను సోలుపుగా నిలబెట్టి నీళ్ల తాపించేదంటే మాట్లా?

ఎంత పోరకలాణ్ణా గొర్రె జాతి నీళ్ల రేవుకు ఒక దానెంట వొగిటిగా పోవు! ఎంత జుట్టు పీక్కుణ్ణా ఈ తలకాయిలోకి ఆలోచిన్లు ఒక దానెంబడి వొగిటి రమ్మన్నా రావు!

మా ఊర్రోడ్డు అంటానే యిత్తుముందా? చెట్టు ముందా? అన్నెట్లు ఊరు ముందా? రోడ్డు ముందా? సందేహం. రోడ్డు పడిందని రోడ్డు పక్కన ఊరుకట్టు కుణ్ణారా? లేకుండా పోతే ఊరుండాదని రోడ్డేసినారా? ఏది ముందు? ఏది ఎనక? ఎట్ట తేల్సాల? –

అసలు ఉండేదంతా ఉండంగా మా ఊర్రోడ్డు కత ఎందుకు ఎత్తుకోవాల? ఎందుకంటే రోడ్లు నాగరికతను సూచించునని రోడ్ల పక్కన నిలువు రాళ్ల మింద నీట్‌గా రాసి పెట్టుంటారు. అంటే మా ఊర్రోడ్డుకు మా ఊరి నాగరికతకు చుట్టిరికం ఉంటిందనా? ఈ కాలంలో మహన్నబావులు శానా శానా మంది కాగితాల మింద అచ్చుగుద్దేసి అంట గట్టా ఉండారు. దాంట్లో అర్తం పర్తం లేనట్టుగానే రోడ్డు పక్కన రాళ్ల మింద రాతలు. 'నిదానముగా పొమ్ము!' అని రాసుంటే ఆడ ఏ బస్సు నిదానంగా పోతా వుండాది? ఏ లారీ దీన్ని గెవనిస్తా ఉండాది? అర్తం పర్తం లేని రాళ్లమింద రాతల మాదిర యిప్పుడు అర్తం పర్తం లేకుండా మా ఊర్రోడ్డు ఎందుకు నా తలకాయిలోకి దూరాల?

అదే తమాస!

ఏ మాట కామాట. ఎపుడెంటో పాయ్ డిల్లీలో పార్ల మెంటుకు పాయ్యేరోడ్డు చూసినా. అయిద్రాబాద్‌లో అబిడ్స్ కాడ రోడ్డు చూసినా. విజయవాడలో బందర్ రోడ్డు చూసినా. కొండ మిందనే కొంద్రేసినట్టు తిరమల కొండ మింద వొంపు సొంపులుగా ఉండే గాట్ రోడ్డు చూసినా. వీటన్నిటి కంటేనా మా ఊర్రోడ్డు?

మణిసి యాణ్ణో ఒక చోట ఉద్దోగమో సద్దోగమో చేసుకుంటా అణ్ణే స్తిరపడి పోతాడు. ఏదో ఒక యిదంగా మణిసి యిన్ని ఊళ్లతో సంబంధం పెట్టుకుణ్ణాడు గదా? అట్టని అన్ని ఊళ్లను నా ఊరంటాడా?

అనడే! అదే యిచ్చిత్రం!–

మణుసు యింత నలుపెక్కనపుడు... నాలిక యింత పదునెక్క నపుడు... చూపు యింత వక్రం కానపుడు... ముక్కుల్ను యింత కంపు మసించ నపుడు... యింత నంగనాసి తనం నడక ఎరగనపుడు– ముక్కులో కార్తా వుండే చీమిడి.. జారిపోతా వుండే నిక్కరే దీనికి సాచ్చిగా నిలబణ్ణెప్పుడు– ఏ మట్టి వాసన ఒంట పట్టిందో అదే తన మట్టి అనుకుంటాడు. చచ్చేదాకా ఆ మమకారాన్ని చంపుకోలేకుండా కొటకలాడ్తానే ఉంటాడు.

అదే మా ఊరు!– అంటాడు.

అట్టా మాదిర్నే మా ఊరూ ఉండాది.

ఆ ఊళ్లో పాయ్‌నోళ్లపోగా ఉండే వాళ్లుండారు– చస్తా బతకతా. ఎవుడికి వాడు దినాలు లెక్క పెట్టుకుంటా!

అందుకే మా వెంకట రెడ్డి అంటా ఉంటాడు–

''అన్నా! నిజింగా ఏ చావుకో దినాలకో తప్పిస్తే నీకేం గాచ్చారమా ఈ కొంప కొచ్చేదానికి?'' అని.

''కాదురా వెంకట రెడ్డీ! ఈ ఊరు యిడ్సి పెట్టేసి పొయ్యింది ఒక గాచ్చారం. ఉద్దోగం పేర్తో ఊళ్లూళ్లూ తిరిగిందొక గాచ్చారం... చూస్తా చూస్తానే పెండ్లి చేసుకునింది ఒక గాచ్చారం... బిడ్డల్ను కనుక్కునిందొక గాచ్చారం... వాళ్ల మింద మమకారాన్ని పెంచు కుణ్ణిందీ ఒక గాచ్చారం... కడాన ఈ బతుకే ఒక గాచ్చారం రా?'' అని ఎట్టా చెప్పమంటారు?

మా ఊర్రోడ్డు ముందుకు పోతా ఉండాది. నేనూ పోతా వుండా. ఆ పొయ్యే పోకడల్లో ఏందో లింకు ఉండేటట్టుగా ఉండాది. కొండో కోనో వంకో వాగో అడ్డంగా వస్తే మా ఊర్రోడ్డు మలుపు తిరగతా ముందుకు పోతా వుండాది. నా బతుకు ఆడికే ఉండాది. కండ్లు ఉండీ కబోది యదవగా... ఎన్నో అన్నాయాల్ను అక్రమాల్ను చూస్తానే చూణ్ణోడి మాదిరిగా... నంగనాసి నా కొడుకుల్తో తగిలీ తగలకుండా... మేమే కారివేదులను కుండే యదవల్తో రాజీపడ్తా... తడి గుడ్డల్తో గొంతు కోసే నాయాండ్లను తప్పించుకుంటా నేనూ ముందుకు పోతా ఉండా.

ఎందుకు పోవాలని మొండి కేసి నడి రోడ్డోనే పడక సీను ఏసే దానికి నేనేం ముఖ్యమంత్రినా? కడాన ఒక ఎమ్మెల్లేనా?

ఏమీకానోడు ఈ దేశింలో ఎనిక్కి తిరిగి చూస్తే ఏమయి పోతానో అని గుండి కాయిలు అర్సేతిలో పెట్టుకోని యిరుకు దోవలగుండా యిబ్బందుల గుంతల్లో పడ్తా లేస్తా ముందుకు పోవాల్సిందే. నేను యిప్పుడు మా ఊ(రోడ్డు మింద పోతా వుణ్ణెట్టు!

మా ఊ(రోడ్డు అంటే అప్పిటి లెక్కల్లో నాలుగు మైళ్లు. ఇప్పిటి లెక్కల్లో ఆరు కిలోమీటర్లు. పేరే మారింది. దూరం మార్లా. ఇంగ్లీషోడు పెట్నె ఇండియా పేరు బారతదేశింగా మార్నా బారతదేశింలో మన బతుకులు మార్నట్టు!

కాలి మింద కాలేసి కండ్లద్దాలు తీసి చేతిలో పట్టుకోని నాలుగ్కాళ్లమండపం కాడికి పొయ్యేదానికి రిక్సాలో కూసుణ్ణె మా బాశాలి మా ఊ(రోడ్డు మింద దినమ్మూ ఆరారు పన్నిండు కిలోమీటర్లు నడ్సినానంటే నన్ను చూసి నవ్వితిందా?

నవ్వితే నవ్వనీలే!

నడ్సేదాన్లో ఉండే సుకం రిక్సాలో కూసోని యింకొకడు రెక్కలు ముక్కలు చేసుకుంటా తొక్కతా వుంటే చూసేదాంట్లో ఉంటిందా? ఉంటిందని వాదించే వాళ్లతో వాదించేది ఉర్దాగా నోరు పారేసుకుణ్ణెట్టే. నా మట్టుకు నాకు అటుమంటి కాలం మల్లా రాబోతిందా అనిపిస్తా ఉంటింది.

సడేలే! నువ్వేంది కోన్ కిస్కా.'గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని మహ మహా కవులే చెప్పేసి పొయ్యుండారు. పాపం! అట్లా చెప్పిందానికి దచ్చిన గిచ్చిన కూడా అడగలా. ఓల్డ్ ఈజ్ గోల్డ్! అంటే ఓల్డంతా గోల్డయితే దాచి పెట్టుకుండే దానికి గోడౌన్లు యాడుండాయి- మణుసులే గుడిసెల్లో మల్లగుల్లాలు పడ్తావుంటే!

అయితే చచ్చి సొర్గ లోకాన ఉండే మా తల్లి సాచ్చిగా చెప్తా వుండా. ఆరో తరగతి చదువు కుండే దానికి దినమ్మూ ఆరారు పన్నిండు కిలోమీటర్లు నడ్సే అవకాశం మీ కెందురికి దొరికిందో నాకైతే తెల్దు గానీ అదొక అదురుష్టమని యిప్పిటికీ నేను అనుకుంటా ఉండా.

నడ్సేది పాయ్ యాడన్నా అదురుష్టమా? అంటే- కాదా మరి? తిని తిని వొళ్లంతా కొవ్వెక్కినోళ్లు తెల్లారే కాడికి వాకింగ్ పేర్తో రోడ్ల మింద బడి నడస్తా వుంటారు గదా? అటుమంటి కర్మ మనకీ పొద్దుటికీ పట్టలేదంటే అది మన అదురుష్టం కాదంటారా?

ఒళ్లు కొవ్వెక్కి కాదు. నవ్వులాటకు అసలే కాదు. నాలుగచ్చిరాలు నేర్సుకుండేదానికి నడవాలని పట్టుబట్టి నడ్సినాం. నడ్సిందీ ఆ రోజులు గడ్సిందీ తల్చుకుంటా ఉంటే-

గెంజి నీళ్ల బాయిలో నీళ్లు గలగలా నవ్వతాయి. మామిడి మాకల వంకలో యిసిక పలకరిస్తింది. ముగ్గురాళ్ల వంకలో ముగ్గురాళ్లు గుండికాయి మీద ముగ్గులే పోస్తాయి. ఆ అడివిలో చెట్టు చెట్టు కొమ్మ కొమ్మ రెమ్మ రెమ్మ ఆకు ఆకు మణుసు యిచ్చి మాట్లాడ్తాయి. ఆ చెట్ల మింద పాల పిట్టలు కూని రాగాలు తీస్తాయి.

వీటన్నిటికీ మించి పీటర్. పీటరంటే యీడొక పిట్టల దొర అనుకుండేరు. పీటర్ రాజారాం బస్ సర్వీసులో డ్రయివర్. ఆ కాలాన ఆరూట్లో తిరగతా ఉణ్ణింది అదొగిటే బస్సు. అదిగూడా బొగ్గు బస్సు!

ఇది ఎర్ర బస్సుల కాలం. ఎరుపు రంగు అంటేనే డేంజర్. ఈ బస్సులూ డేంజరే. బస్సుల్లో ఎక్కే మణుసులూ డేంజరే. ఎవుడి చేతిలో నాటు బాంబులుండాయో? ఎవుడి జేబీలో పిస్తోళ్లుండాయో? మనకేం తెలిస్తింది. నడిదోవలో నిలబెట్టి సంచిలో వుండే బాంబో చంకలో ఉండే పిస్తోలో చేతికెత్తుకోని శాతుండేది ఎత్తండి? అంటే అప్పుడు తెలిస్తింది. అప్పుడు తెలిస్తే ఏమి లాబం?

ఇప్పటి మాదిర బస్సులు డీజల్తో పెట్రోల్తో నడవక పాయ్‌నా బొగ్గు బస్సుల్లో ఈ డేంజర్ ఉండేది గాదు. అయితే మిట్టెక్కే లేకుండా గుర్రు గుర్రు మని వొగిరించేవి. అవ్వి అట్లా వొగిరిస్తా వుంటే కూసోనుండే వాళ్లకు శానా కుశాల! ఇప్పుడు ఎర్రబస్సులు ఎక్కే శానా మందికి కోల్‌గ్యాస్‌తో నడ్సిన ఆ బస్సుల కత తెల్దులే!

మా ఊరి రూట్లో నడస్తా ఉణ్ణె ఆ ఒక్క బొగ్గు బస్సు తెల్లార్తో కార్వేటి నగరాన్నుంచి చిత్తూరికి సందేళ కాడ చిత్తూర్నుంచి కార్వేటి నగరానికి పోతా ఉండేది.

తెల్లార్తో మేము యిస్కూలికి పోతా వుంటే నడి దోవలో ఆ బస్సు మమ్మల తొలగేసుకోని పాయ్యేది. సందేళ కాడ యిస్కూల్నించి యింటి కొస్తా ఉంటే గూడా అంతే. ఆ బస్సు మమ్మల్నట్లా తొలగేసుకోని పోతావుంటే మేమంతా రోడ్డు వార సోలుపుగా నిలబడుకోని తెల్లార్తో గుడ్ మాణింగని సందేళకాడ గుడీవినింగని సెల్యూట్ కొట్టేవాళ్లం. పీటర్ గూడా నవ్వుకుంటా మాకు సెల్యూట్ చేసేవాడు. అప్పుడు మా కెంత కుశాలో? ఆ బస్సు ఎక్కినంత కుశాల! ఓయమ్మో! ఆ దినాల్లో బస్సెక్కేదంటే మాట్లా!

వర్సగా వారం దినాలు యిడవకుండా గుణ్‌మార్నింగ్ గుడీవినింగ్ కొట్టేకుందికి పీటర్ దొర ఒక దినం మమ్మల చూస్తానే బస్సు నిలబెట్టేసె. అందుర్నీ ఎక్కండ్రా! అనె.

కోడి పిల్లలు గంప కింద దూర్నెట్టు అందురు గబ గబ బస్సులో దూరుకుణ్ణాం. బస్సు కదిలింది. మా జిడ్డు మొకాల్లోనే తంగేడు పూలు యిడగతా ఉండాయి. ఒకరి మొకం ఒకరు చూసుకుంటా ముసి ముసిగా నవ్వుకుంటా ఉండాం. అంతలోకే మా ఊరు వచ్చేసె. ఇంకొంచిం సేపు రాకుండావుంటే ఎంత బాగుణ్ణో అనుకుంటా ఉండంగానే అందుర్నీ గుంట కట్టమింద దించేసి దాని పాటికది పాయ!

నిజిం చెప్పినా యింటారు. అపద్దం చెప్పినా యింటారు. ఇనకుండా ఏం చేస్తార్లే? ఏం చెప్పినా యినే దానికి మన నాయకులు వేదికల మింద నిలబడి మనకు అలవాటు చేసి పారేసి ఉండ్లా. అట్లని అపద్దం చెప్తా ఉండానని మీరు అనుకుంటే మా ఊర్రోడ్డు సాచ్చిగా మీ పాపాన మీరే పోతారు.

గుంటకట్టమింద బస్సు దిగి నడస్తా వుంటే యింకా బస్సులో ఉణ్ణిట్టే ఉండాది.

తిండి తింటా వుంటే అట్నే ఉండాది. పుస్తకం ఎత్తుకుంటే అట్నే ఉండాది. కడాన ఆ రేత్రి కల్లోగూడా బస్సులో పోతా ఉణ్ణిట్టే ఉండాది.

ఆ పొద్దుట్నుంచి అంతే! మేము నడ్సి పోతావుంటే పీటర్ బస్సు నిలిపి మమ్మల ఎక్కించుకునే వాడు.

పాపం! పీటర్ దొరకు పిలకాయిలంటే శానా ముదిగారం. మేము బస్సు ఎక్కీ ఎక్కంగానే తమాస లెక్కలు అడిగేవాడు. పద్దేలు చెప్పమనే వాడు. పాటలు పాడమనే వాడు. ఏందేందో కొచ్చిన్లు అడిగే వాడు. పిలకాయిల మింద యిట్టా ప్రేమ ఉండాలంటే పీటర్‌కు పిలకయిలన్నా లేకుండా ఉండాల. అట్ట గాకుంటే శానామందైనా ఉండాల. అడగాల. అడగాల! అనుకుంటా ఉండంగానే మా ఊర్రోడ్డుకు నాకు రుణం తీరిపాయ.

మల్లా నాకు పీటర్ కనపడింది ఒకే ఒక్కసారి!

నేను రైల్వేలో ఉద్దోగంలో చేర్నా. అనంతపురంలో బుక్కింగు క్లార్కుగా పని చేస్తా ఉండా. ఆ పొద్దు దర్మావరం సైడుకు పొయ్యే రైలు అనంతపురం ప్లాట్‌పారం మింద కదలబోతా ఉండాది.

''సార్! సార్! చిత్తూరికొక టిక్కట్టు సార్!... అర్జంటు సార్!... ప్లీజ్ సార్!'' అంటా గస పోసుకుంటా పరిగిత్తా బుక్కింగు కవుంటర్ కాడికొచ్చిన మణిసి పీటర్!

ఆయన నన్ను గుర్తు పట్లా. నేను ఆయన్ను గుర్తు పట్నా. అయినా–

''బండి కదల్తా వుంటే యిప్పుడేం టిక్కట్టయ్యా?'' అని దబాయిస్తానే పరిగిత్తా ప్లాటుపారం మిందికి పొయ్‌నా. గార్డు మదార్ సాయిబు. శానా మంచోడు. అడుక్కుండే కుందికి పచ్చ దీపెం ఆడిస్తా వుణ్ణె మణిసి ఎర్ర దీపెం చూపించె. బండి నిల్సిపాయ. పీటర్ను లోపలికి రమ్మని పిల్సినా. గార్డుతో కూడానే ఎక్కించినా. చిత్తూరికి పోవాలంటే దర్మావరంలో బండి మారాల. ఆడ గార్డుతో మాట్లాడి ఎట్టన్నా సరే పీటర్ను చిత్తూరికి పంపించమన్నా.

''సెప్పిన్యావ్ గద రెడ్డీ! యింకా నాకీ యిడ్సిపెట్!'' అంటా మదార్ సాయిబు పచ్చ దీపెం ఆడించె.

పీటర్‌కి యిదంతా అయోమయంగా ఉండాది. పిచ్చి చూపులు చూస్తా వుండాడు.

''సార్! మీకు పిల్లోళ్లంటే శానా యిష్టం గదసా. నేను సా. పెనుమూర్లో చదువుకుంటా ఉణ్ణెప్పుడు సా. దినమ్మూ బస్సులో సా..'' అంటా ఉండంగానే బండి స్పీడు అందుకుండె. కానీ ఆయిన కండ్లల్లో నీళ్లు కదిలింది నాకు కనిపించె!

రొండు చోట్ల దిగి మూడు బస్సులు ఎక్కే ఓపిక లేకుండా చావుకో దినాలకో మా ఊర్రోడ్లో స్కూటర్ మింద పోతా వుండా.

సొతంత్రం రాక ముందు మా ఊర్రోడ్డు మట్టిరోడ్డు. అయితే మాత్రం ఏం? ఎంతో బాగుండె. బాగుణ్ణె ఆ రోడ్డు మింద వొగిటే బస్సు వస్తా పోతా ఉండె. సొతంత్రం వచ్చినాక

ఈ ఎర్ర బస్సులు శానా సొతంత్రించి తిరగతా వుంటే ఆ రోడ్లో యాడ చూడు మోకాటిలోతు గుంతలే!

మా ఊర్రోడ్డు తలకాయిలో దూరి నన్ను యాడికేడికో తీసుకోని పోతే స్కూటర్ దాని పాటికది ఎట్టెట్నో పాయ్ నన్నొక గుంతలో పడదోసి నిమ్మతి పడె.

కాలికి కట్టు కట్టుకోని కుంటతా కుంటతా నడస్తావుంటే ఆ నాలుగ్కాళ్లమండపం కాడ ముత్తారెడ్డన్న ఎదురుపడి–

''ఏమయిందిరా అబ్బోడా!'' అని అడిగె.

మీతో చెప్పినట్టే ఆయనతో గూడా మా ఊర్రోడ్డు కత చెప్తి.

''ఒరే అబ్బోడా! మీ ఊరూ మీ ఊర్రోడ్డే గాదు. దేశింలో ఉండే ఊళ్లూ రోడ్లూ అన్నీ సొతంత్రం రాక ముందర ఎట్టుణ్ణాయో అట్నే ఉండాల. అప్పుడు పార్టీ వాళ్లు ఎక్స్ పార్టీ వాళ్లు 'మేం బాగ చేస్తాం! మేం బ్యాగ చేస్తాం!' అంటా ఒకరి మిందొకరు పోటీ పడ్తా మన దగ్గిర ఓట్లేగాదు... ఈ మట్టిలో బంగారు గూడా పండించు కుంటార్రా!'' అనె.

''అదెట్టన్నా?'' అంటే–

''ఏముండాదిరా. చూస్తా ఉండంగానే నిమిశాల్లో ఎస్టిమేట్లు లచ్చిల మింద తయారై పోతాయి. ఆ రోడ్ల మొకాన అంత మట్టి పడ్తింది. కాగితాల మింద పనై పోతింది. పనైపోతే యింకేం వుండాది. నిమిశాల్లో బిల్లులు పాసైపోతాయి. పచ్చ కాగితాల కట్టలు తిలా పాపం తలా పిడికిడుగా మారి పోతాయి. ఈ రోడ్లు యిట్టా ఉణ్ణెంత కాలం నీ కాలికి దెబ్బ తగిల్తే అది నీ కర్మ. వాళ్లకు మాత్రం పండగ. కాదంటావా?'' అని అడిగె.

మీరు అపద్దం అనుకుంటే దానికి మా ఊర్రోడ్డే సాచ్చి! ●